అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శుక్రవారం 20 జనవరి 2023

మానసికోల్లాసానికి క్రీడలు

కౌటాల : క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని ముత్తంపేట్ గ్రామంలో మాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నమెంట్‌ను సర్పంచ్ ఆదె శ్రీనివాస్, మాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదె వసంత్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ఈర్ష్యాద్వేషాలు లేకుండా శాంతియుత వాతావరణంలో క్రీడలు ముగించుకోవాలని, గెలుపే ఓటమికి నాందని తెలిపారు. వాలీబాల్ శరీర వ్యాయామానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. క్రీడల వల్ల యువత పెడదారి పట్టకుండా మంచిమార్గంలో ఉంటారన్నారు.



అండర్ బ్రిడ్జి నిర్మించాలని రాస్తారోకో

వాంకిడి : అండర్ బ్రిడ్జి నిర్మించాలని హైదరాబాద్, నాగ్‌పూర్ అంతర్‌రాష్ట్ర రహదారిపై వేర్వేరు ప్రాంతాల్లో గురువారం కేవీపీఎస్, శివాజీచౌక్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఆర్ఐ మాజిద్ రాస్తారోకో నిర్వహిస్తున్న వారితో మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని సర్దిచెప్పడంతో రాస్తారోకోను విరమించారు. రాస్తారోకోలో కేవీపీఎస్ నాయకులు దిన్‌కర్, కార్తీక్, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు సుచిత్, సెంటర్ కమిటీ సభ్యులు అశోక్, స్థానికులు పాల్గొన్నారు.



తల్లీబిడ్డ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



నవతెలంగాణ - జైనూర్

ప్రతి అంగన్‌వాడీ సెంటర్ ద్వారా తల్లీబిడ్డలను రక్షించడానికే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా పనిచేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు అన్నారు. గురువారం మండలంలోని దుబ్బగూడ గ్రామ పంచాయతీ పరిధిలో గల అంగన్‌వాడీ కేంద్రంలో ఆట వస్తువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించడమే లక్ష్యమన్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే ప్రతి చిన్నారికి నాణ్యత ఆహారం పెట్టాలన్నారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారంతో పాటు ఆట వస్తువులు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మడావి భీంరావు, అంగన్‌వాడీ టీచర్ కుమ్ర రేణుక, మహిళలు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 14 మహా ధర్నాను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

దళిత బంధు విధివిధానాలు ప్రకటించాలనే డిమాండ్‌తో వచ్చే నెల 14వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద చేపట్టే మహాధర్నా విజయవంతం చేయాలని తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ కోరారు. జిల్లా కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత బంధు పథకానికి సంబంధించి ఎటువంటి విధివిధానాలు లేకుండా ఇష్టం వచ్చినట్లు పంపిణీ చేయడం సరైన విధానం కాదన్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్డీవో, మండల స్థాయిలో ఎంపీడీఓ అధ్యక్షతన కమిటీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దళిత బంధు పథకం ద్వారా ఎంపిక కాబడే లబ్ధిదారులు ఏ ఇతర పథకం కింద ప్రభుత్వం నుంచి లబ్ధి పొందకుండా చూడాలన్నారు. దళిత బంధు పథకం లక్ష్యం నెరవేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన లబ్ధిదారులకు పథకం వర్తించేవిధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి విధివిధానాల రూపకల్పనకు మహాధర్న నిర్వహిస్తున్నట్లు వివరించారు. జిల్లా నుండి పెద్ద ఎత్తున ఈ ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా బాధ్యులు బొమ్మన ధర్మయ్య, అధ్యక్షుడు అంబాల రవి, నాయకులు అశోక్, మల్లేష్, సారంగం, ఏసుదాసు, మొగిలి పాల్గొన్నారు.

రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

నవతెలంగాణ - రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా ఖైరిగూడ ఓసీలో పనిచేస్తున్న ఉద్యోగులకు సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ అమలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి డీఎం(సేఫ్టీ) బెల్లంపల్లి రీజియన్ జాన్ ఆనంద్ హాజరై మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి ఇంటి నుండి బయటకు వెళ్లడం, విధులు ముగించుకొని తిరిగి ఇంటిలో అడుగుపెట్టే వరకు రక్షణ సూత్రాలను పాటించాలన్నారు. ప్రతి ఉద్యోగి రోడ్డుపై వెళ్లేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు, గనిలో సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ నిబంధనను పాటిస్తే ప్రమాదాలు లేని సంస్థగా సింగరేణి నిలుస్తుందని పేర్కొన్నారు. ఎస్ఎంటీటీ ఎస్ఓఎం ఈవీఎస్ విజయ్‌కుమార్ మేనేజ్‌మెంట్ ప్లాన్ అమలుపై ఉద్యోగులకు ప్రొజెక్టర్ ద్వారా రక్షణతో చేసే పనులపై అవగాహన కల్పించారు. పలు దేశాల్లో పాటిస్తున్న రక్షణ సూత్రాలు, పద్ధతులను క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జీఎం కెహెచ్‌ఎన్ గుప్తా, ఏజీఎం ఎం తిరుమలరావు, ప్రాజెక్టు అధికారి ఉమాకాంత్, సేఫ్టీ అధికారి రాజేశ్వర్‌రావు, ఇన్‌చార్జి ప్రాజెక్టు ఇంజనీర్ నరేష్, పిట్ కార్యదర్శి వెంకటేశ్, సీనియర్ పర్సనల్ అధికారి వేణు పాల్గొన్నారు.

వరల్డ్ విజన్ సేవలు ప్రశంసనీయం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

వరల్డ్ విజన్ సేవలు ప్రశంసనీయమని డీఈఓ రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కేజీబీవీలో వరల్డ్ విజన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థినులకు ఐకాన్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. మండలంలోని ఏడు ఉన్నత పాఠశాలలు, ఒక కేజీబీవీ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు రూ.50వేల విలువ చేసే స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ అడ్వాల పద్మరమేష్, జడ్పీటీసీ ఓస రాజేశ్వర్ మాట్లాడుతూ వరల్డ్ విజన్ స్వచ్ఛంద సంస్థ సేవలు అమూల్యమైనవని పేర్కొన్నారు. మండల విద్యాధికారి మధుసూదన్, మండలంలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ ప్రిన్సిపాల్ నవిత పాల్గొన్నారు.

ఐక్య గురుకులాల రాష్ట్ర అధ్యక్షుడిగా దూలం ఎల్లయ్య

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 13,14 వ తేదీలలో రంగారెడ్డి జిల్లా మన్నెగూడలో జరిగిన రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభల్లో ఐక్య గురుకులాల రాష్ట్ర అధ్యక్షుడిగా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, ఆసిఫాబాద్ ఉపాధ్యాయుడు దూలం ఎల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక పట్ల జిల్లా అధ్యక్ష కార్యదర్శి శాంతకుమారి, ఇందు రావు, జిల్లా ఐక్య గురుకులాల కన్వీనర్లు నరేందర్, వినోద్, శ్యామ్, శిరీష, మండల యూటీఎఫ్ అధ్యక్షులు ఉపేందర్ సింగతి అభినందించారు.

ప్రజా కవి వేమన జయంతి

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలో సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో ప్రజా కవి వేమన జయంతిని గురువారం నిర్వహించారు. ఈ సంధర్భంగా వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా కాసిపేట మండల కవి గొల్లపల్లి బ్రహ్మయ్యను శాలువాలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆ వేదిక అధ్యక్షుడు పల్లె మల్లయ్య, ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, సిలోజ్ మురళి, గోనెల శ్రీనివాస్, చిన్న భీమయ్య, సీహెచ్ ప్రభాకర్, అయిల్ల రాజం, కుర్మ నర్సయ్య పాల్గొన్నారు.

108, 102 సేవల పరిశీలన

నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని 108, 102 అంబులెన్సు సేవలను 108, 102 ప్రోగ్రాం మేనేజర్ స్వామాట్ పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. దీంతో పాటు 102 సర్వీసులను స్థానిక వైద్య పరీక్షలకు వినియోగించుకోవాలని సూచించారు. పలు అంశాలపై సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో 108, 102 ప్రోగ్రాం ఈఎంఇ కౌండల్, ఎస్సీ జనార్ధన్ పాల్గొన్నారు.

కొత్త వారికి రైతుబంధు ఏదీ..!

- దరఖాస్తు చేసినా అందని పెట్టుబడి సాయం
- ఇంకా తెరుచుకోని పోర్టల్..నమోదు కాని పేర్లు
- ఆశగా ఎదురుచూస్తున్న అన్నదాతలు

అన్నదాతలకు పంట పెట్టుబడికోసం ప్రభుత్వం అందజేస్తున్న రైతుబంధు నిధులు కొత్త రైతుల దరికి చేరడం లేదు. కొత్తగా భూ యజమాన్య హక్కులు పొందిన అనేక మంది రైతులు ఈ రైతుబంధు కోసం వ్యవసాయ అధికారులకు దరఖాస్తులు చేసినా ఎలాంటి ఫలితం ఉండటం లేదు. ప్రభుత్వం నిర్దేశించిన డిసెంబర్ 20వ తేదీలోపు దరఖాస్తులు అందజేసినా ఫలితం లేకుండా పోయింది. రైతుబంధు పోర్టల్ తెరుచుకోకపోవడంతో కొత్త రైతులకు ప్రభుత్వ సాయం అందని ద్రాక్షగా మారుతోంది. ఈ సాయం కోసం అధికారులను కలిసినా తామేమీ చేయలేమని చేతులెత్తేస్తున్నారు. ఈ పోర్టల్ తెరుచుకుంటే కానీ రైతులకు న్యాయం చేయలేని చెబుతున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనేక మంది రైతులు ప్రభుత్వ ఆర్థిక సాయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.



జైనథ్ మండల కేంద్రానికి చెందిన ఈ రైతు పేరు కున్నల వినోద్. తండ్రి రాములు పేరిట ఉన్న భూమిలో 1.20 ఎకరాలు వారసత్వంగా ఈయనకు వచ్చింది. కొత్తగా ఈయన పేరు మీద పట్టా కూడా పొందడంతో కిందటేడాది డిసెంబర్ 20లోపు రైతుబంధు కోసం దరఖాస్తు చేశారు. కానీ సంబంధిత పోర్టల్ తెరుచుకోకపోవడంతో ఈయన పేరు నమోదు కాలేదు. దీంతో యాసంగిలో ఈ రైతుకు చేరాల్సిన పెట్టుబడి సాయం అందలేదు. ఇలాంటి రైతులు ఒక్క ఆదిలాబాద్ జిల్లాలోనే 3800మంది వరకు ఉన్నారు. మిగితా మూడు జిల్లాలోనూ ఇదే సంఖ్యలో ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

అన్నదాతలకు పంట పెట్టుబడి కోసం ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం కొన్నేండ్ల నుంచి రైతుబంధు పేరిట డబ్బులు అందజేస్తోంది. ఏడాదికి ఎకరానికి రూ.పదివేల చొప్పున రెండు విడతలుగా ఈ డబ్బులను రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తోంది. ఈ పెట్టుబడి సాయంతో రైతులు పంట కోసం వినియోగించే విత్తనాలు, ఎరువులు, రసాయనిక మందులు కొనుగోలు చేసేవారు. ఇది వరకు పంట కోసం మధ్య దళారుల నుంచి అప్పులు తీసుకొచ్చి పంటలు పండించిన అనేక మంది రైతులు ఈ రైతుబంధు పథకం వచ్చిన నాటి నుంచి ఆ బెడద నుంచి తప్పించుకుంటున్నారు. ఎకరానికి రూ.5వేల చొప్పున ప్రభుత్వమే అందజేస్తుండటంతో ఎన్ని ఎకరాలు ఉంటే అంత డబ్బులు వస్తుండటంతో చాలా మంది రైతులు అప్పు కోసం దళారుల వద్దకు వెళ్లడం లేదు. ప్రతి సీజన్‌లో కొత్తగా నమోదు చేసుకున్న రైతులకు కూడా ప్రభుత్వం వెంట వెంటనే సాయం అందజేస్తోంది. ఇటీవల యాసంగి పంట కోసం సైతం రైతులకు ఈ పెట్టుబడి సాయం జమ చేసింది. కిందటేడాది డిసెంబర్ 28వ తేదీ నుంచి విడతల వారీగా ప్రభుత్వం ఈ సాయం రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. ఇప్పటి వరకు 5 ఎకరాలు కలిగిన రైతులకు కూడా అందజేసినట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. కానీ వానాకాలం సీజన్ తర్వాత కొత్తగా పట్టాలు పొందిన రైతులకు ఈ ఆర్థిక సాయం అందకపోవడంతో ఆశగా ఎదురుచూస్తున్నారు.

తెరుచుకోని రైతుబంధు పోర్టల్..!

ప్రతి ఏటా భూముల అమ్మకాలు, కొనుగోళ్లుజరుగుతుంటాయి. ఒకరి నుంచి మరొకరికి పట్టాల మార్పిడిలు జరగడం సాధారణంగా మారుతుంది. ఈక్రమంలో కొత్తగా భూముల పట్టాలు పొందిన వారితో పాటు వారసత్వపట్టాలు పొందిన తదితరులందరూ ఈ రైతుబంధు కోసం దరఖాస్తులు చేసుకుంటారు. ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ పెట్టుబడి సాయం రైతుబంధు పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. రైతులు ఆయా గ్రామాల పరిధిలోని ఏఈఓలకు వివరాలు అందజేస్తే వారు సంబంధిత పోర్టల్‌లో నమోదు చేస్తారు. ప్రభుత్వం కిందటేడాది డిసెంబర్ 20వ తేదీ వరకు దరఖాస్తులకు అవకాశం కల్పించింది. కేవలం ఆదిలాబాద్ జిల్లాలోనే కొత్త రైతులు 3800మంది వరకు ఉంటారని అధికారులు చెబుతున్నారు. ఈ పోర్టల్ తెరుచుకోకపోవడంతో ఈ రైతులందరికీ పెట్టుబడి సాయం అందడం లేదు. ఉమ్మడి జిల్లాలో మరో పదివేలమంది వరకు కొత్త రైతులు ఉంటారని అంచనా వేస్తున్నారు. భూమి పొందినా పెట్టుబడి సాయం రాకపోవడంతో అన్నదాతలు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.



ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం : పుల్లయ్య, జిల్లా వ్యవసాయశాఖాధికారి



కొత్తగా భూ యాజమాన్య హక్కులు పొందిన రైతులకు సంబంధించి వివరాలను తీసుకున్నాం. కానీ పోర్టల్ తెరుచుకోకపోవడంతో రైతుల వివరాలు నమోదుకు ఆటంకం ఎదురవుతోంది. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ఈ పోర్టల్ తెరుచుకోగానే కొత్త రైతులకు కూడా పెట్టుబడి సాయం అందుతుంది.

సీసీఐ భూముల పరిరక్షణకు పోరాటం

- లైమ్‌స్టోమ్ నిల్వలను పరిశీలించిన సీపీఐ(ఎం)నాయకులు



నవతెలంగాణ- ఆదిలాబాద్‌టౌన్

అన్యాక్రాంతమవుతున్న సీసీఐ(సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) లీజు భూములు, లైమ్‌స్టోన్ నిల్వలను పరిరక్షించేందుకు పోరాటం నిర్వహించనున్నట్లు సీపీఐ(ఎం) నాయకులు స్పష్టం చేశారు. గురువారం పరిశ్రమ వద్దకు వెళ్లిన నాయకులు లీజు స్థలాలు, వెంచర్ల కోసం వినియోగించిన లైమ్‌స్టోన్ నిల్వలను పరిశీలించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలోని ఏకైక ప్రభుత్వ రంగ పరిశ్రమను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని వివరించారు. ఈ పరిశ్రమను పున:ప్రారంభించాలని సీసీఐ సాధన సమితి పేరిట సీపీఐ(ఎం) ఇతర ప్రజా సంఘాలను కలుపుకొని పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. మరోవైపు కేంద్రం ఈ పరిశ్రమ యంత్రాలను తుక్కు కింద విక్రయించాలని టెండర్లు పిలిస్తే దాన్ని కూడా అడ్డుకున్నట్లు తెలిపారు. కానీ మరోవైపు భూబకాసురులు సీసీఐ భూములను కాజేయాలని ప్రయత్నాలు ప్రారంభించారని మండిపడ్డారు. ఈ భూముల్లో అక్రమంగా లేఅవుట్లు వేసి వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న ఈ భూములు అన్యాక్రాంతమవుతున్నా సీసీఐ అధికారులు కానీ జిల్లా ఉన్నతాధికారులు కానీ పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ప్రజాప్రతినిధుల అండదండలతోనే భూబకాసురులు రెచ్చిపోతున్నారని తెలిపారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు ఈ భూములను పరిరక్షించేందుకు చిత్తశుద్ధిని ప్రదర్శించాలని, లేనిపక్షంలో వారి హస్తం కూడా ఉన్నట్లు భావించాల్సి వస్తుందని పేర్కొన్నారు. అక్రమ లే అవుట్లు వేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలు, రైతులను ఐక్యం చేసి ఈ భూముల పరిరక్షణ కోసం పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్నమొల్ల కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు బి.ఆశన్న పాల్గొన్నారు.

రెగ్యులేటరీ కమిషన్ ఆదేశాలు ఉపసంహరించుకోవాలి



నవతెలంగాణ-నిర్మల్

విద్యుత్ వినియోగదారులపై భారాలు మోపే రెగ్యులేటరీ కమిషన్ ఆదేశాలు ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి సేతల్‌కార్ అరవింద్ డిమాండ్ చేశారు. గురువారం ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి నెలా ఇంధన సర్దుబాటు చార్జీలను పెంచుకోవచ్చని, ఈ పెంపుదలకు రెగ్యులరేటరీ కమిషన్ అనుమతులు అవసరం లేదని తెలుపుతూ డిస్ట్రిబ్యూటరీ కమిటీ(డిస్కంలు)లకు విద్యుత్ నియంత్రణ మండలి స్వేచ్ఛ కల్పించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్యుత్ వినియోగదారులపై భారాలు మోపే ఈ ఆదేశాలను తీవ్రంగా ఖండిస్తూ, తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 2018 నుండి 2022 వరకు రెగ్యులేటరీ కమిషన్ టారీఫ్ నిర్ణయించలేదన్నారు. డిస్కంలు ఎలాంటి టారీఫ్ ప్రతిపాదనలు ఇవ్వలేదన్నారు. ఈ నాలుగేళ్ల బాకీలు రూ.33వేల కోట్ల వసూళ్లకు 2022-23లో టారీఫ్ ప్రతిపాదనలో ఎలాంటి సూచనలు లేవన్నారు. రెగ్యులేటరీ కమిషన్ అనుమతి లేకుండానే డిస్కంలు గత సంవత్సరం డెవలప్మెంట్ ఛార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై భారాలు వేసి వేల కోట్ల రూపాయలను అక్రమంగా వసూలు చేశాయన్నారు. డిస్కంలు అంతర్గత సామర్థ్యం పెంచుకోకుండా వినియోగదారులపై భారాలు వేస్తున్నాయని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ సలహా మేరకు డిస్కంలు ఫ్యూయల్ సర్ ఛార్జీలు ఎప్పటికప్పుడు వసూలు చేసుకోవాలని, నాలుగు రోజుల క్రితం విద్యుత్ నియంత్రణ మండలి ప్రకటించడం అత్యంత దుర్మార్గమని పేర్కొన్నారు. 2023 ఫిబ్రవరిలో విద్యుత్ ఛార్జీల పెంపుపై బహిరంగ విచారణ ఉన్నందున, జనవరి 30లోపు విద్యుత్ ఛార్జీల పెంపుపై డిస్కంల ప్రతిపాదనలపై అభ్యంతరాలను తెలియజేయాలని రెగ్యులేటరీ కమిషన్ ప్రకటించిందని తెలిపారు. అందుకని ఫిబ్రవరిలో జరిగే బహిరంగ విచారణలో టారిఫ్ నిర్ణయించే వరకు వినియోగదారుల నుండి ఎలాంటి అదనపు ఛార్జీలు వసూలు చేయరాదన్నారు.

పశు మిత్రలకు వేతనం నిర్ణయించాలి

- కలెక్టరేట్ ఎదుట ధర్నా, వినతి



నవతెలంగాణ-నిర్మల్

పశుసంవర్ధక శాఖ పరిధిలో పనిచేస్తున్న పశు మిత్రలకు వేతనం నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. గురువారం కార్యాలయంలో పశుమిత్ర కార్మికులతో జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ పశు సంవర్ధక శాఖ పరిధిలో కింది స్థాయి సహాయకులుగా పనిచేస్తున్న వారిని పశు మిత్ర పేరుతో పిలుస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జంతువులకు ఆరోగ్యపరమైన సేవలను ఎలాంటి పారితోషకం లేకుండా చేయించుకుంటోందన్నారు. ఈ శాఖలో రాష్ట్రవ్యాప్తంగా 2500 మంది పశు మిత్రలు 8 సంవత్సరాల నుండి సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఎక్కువ మంది మహిళలే ఉన్నారని, వీరికి ఐకెపి ద్వారా శిక్షణ ఇచ్చి ఎలాంటి పారితోషికాలు నిర్ణయించకుండా పశువైద్య శాఖలో పశుమిత్రులుగా నియమించారన్నారు. వీరికి తమ ఊరుతో పాటు సబ్ సెంటర్ పరిధిలోని రైతులకు సంబంధించిన జంతువుల ఆరోగ్య సమస్యలను రాత్రనక పగలనక ఎప్పుడు పిలిస్తే అప్పుడు వెళ్లి ఆవులు, బర్రెలు, మేకలు, గొర్రెలు, కోళ్లు, కుక్కలకు గర్భధారణ, వాక్సిన్, టీకాలు, నట్టల మందు వేయటం, శస్త్ర చికిత్సలు, గాలి కుంటు వ్యాధి టీకా తదితర పనులు చేస్తున్నారని పేర్కొన్నారు. వీరికి ఆశా వర్కర్స్ మాదిరిగా వేతనం నిర్ణయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో పశుమిత్రలు పోరాట మార్గం ద్వారా హక్కులు సాధించుకుంటారని పేర్కొన్నారు. జనవరిలో చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

పశుమిత్ర జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా బొమ్మెన సురేశ్, జిల్లా అధ్యక్షురాలిగా సీహెచ్.లక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా లావణ్య, గంగమణి, నవనీత, ప్రధాన కార్యదర్శిగా గోల ఇంద్ర, సహాయ కార్యదర్శులుగా సవిత, పద్మ, ప్రగతి, కోశాధికారిగా డి.నరిత, సభ్యులుగా సుమలత, రజిత ఎన్నికయ్యారు.

కలెక్టరేట్ భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజలకు అన్ని ప్రభుత్వ సేవలు ఒకే చోట లభించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణాలలో భాగంగా జిల్లాలో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్మితమవుతున్న సమీకృత కలెక్టరేట్ సముదాయ పనులను ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, రోడ్లు భవనాల శాఖ ఈఈ పెద్దన్నతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు వేగవంతంగా అందుతాయని తెలిపారు. పనుల నిమిత్తం కలెక్టరేట్ భవనానికి వచ్చిన ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించే విధంగా భవన ఆవరణలో పూలు, పండ్ల మొక్కలను నాటి సంరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. భవనంలో నీటి వినియోగానికి అవసరమైన అదనపు బోరు పనులను త్వరగా పూర్తి చేయాలని, భవనంలోని అన్ని గదులకు తాగునీరు అందే విధంగా పైపులైన్లు ఏర్పాటు చేయాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అటవీ శాఖ అతిథిగృహ నిర్మాణానికి భూమి పూజ



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ముందు అటవీ శాఖ అతిథి గృహ నిర్మాణానికి ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు గురువారం భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అతిథి గృహం అటవీ శాఖ కంపా బడ్జెట్ నిధులు రూ.26లక్షలతో నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లావణ్య, జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య, బోథ్ మార్కెట్ కమిటీ అధ్యక్షులు సోలంకీ రుక్మన్‌సింగ్, నియోజకవర్గ యువ నాయకులు అడ్వకేట్ రాథోడ్ విశ్వజిత్ నాయక్, రేంజ్ ఆఫీసర్ పాండురంగ్, డిప్యూటి రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ మహాజన్, ప్రితం, వెంకటేష్, ఈశ్వర్, వివేకొరెడ్డి, మండల కన్వీనర్ రాజారాం, నాయకులు నిస్తే కైలాష్, అక్షయ్, మాజర్, అందే ప్రకాశ్, చట్ల విలాస్ పాల్గొన్నారు.

పవిత్ర జలం కోసం సంస్కార్ కేంద్ర సభ్యులు



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో నిర్మించనున్న మాతంగ్ ఋషి సంస్కార కేంద్రం కోసం మాతంగ్‌ల పుణ్యక్షేత్రం కర్ణాటక రాష్ట్రంలోని హంపి పుణ్యక్షేత్రం నుండి పవిత్ర జలం, పవిత్ర మట్టి తీసుకురావడానికి గురువారం సంస్కార కేంద్ర సభ్యులు బయలుదేరారు. వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్ జెండా ఊపి వారిని సాగనంపారు. సంస్కార కేంద్రం వ్యవస్థాపకులు సూర్యవంశీ పండరి, అధ్యక్షులు సాగురే పాండు, ఉపాధ్యక్షుడు మోరే నర్సింగ్, సభ్యులు కల్వలే అరవింద్, వాగ్మారే వామన్, మేటే సదాశివ్, రామారావ్, రుద్రు ఉన్నారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

కుభీర్ : జీవితంపై విరక్తి చెంది వాయిలింగి గ్రామానికి చెందిన కదం మారుతి(38) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కొంత కాలం నుంచి పనీపాట లేకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. ఈ క్రమంలోనే మద్యానికి బానిసయ్యాడు. బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేనిది చూసి భార్య చీరతో దూలానికి ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే భైంసా ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందాడు. భార్య సత్యశీల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ షరీఫ్ తెలిపారు.

ఘనంగా మహారాణా ప్రతాప్ 426వ వర్ధంతి

నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలో మహారాణా ప్రతాప్ 426వ వర్ధంతిని రాజ్‌పుత్ సమాజ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్



హాజరయ్యారు. మహారాణా ప్రతాప్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ధైర్య సాహసాలను కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణంరాజు, సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్‌సింగ్ సభ్యులు పాల్గొన్నారు.

గోదావరి ఘాట్లపై స్వచ్ఛ భారత్

నవతెలంగాణ-బాసర

పవిత్ర గోదావరి నది తీరాన ఘాట్లపై గురువారం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో మత్స్యకారులు స్వచ్ఛ భారత్ నిర్వహించారు. గోదావరి నదిలో ఒకటో ఘాట్‌పై పూడికతీతను తీసివేశారు. ఘాట్లపై ఉన్న చెత్తాచెదారాన్ని ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. మొదటి ఘాట్లను మత్స్యకారులు పరిసరాలను శుభ్రపరిచారు. వసంత పంచమి ఉత్సవాలు మరో వారం రోజుల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో భక్తుల పుణ్యస్నానాలకు ఇబ్బందులు తలెత్తకుండ ముందస్తుగా గోదావరి నది ఘాట్లను శుభ్రపరచినట్లు మొనాజీ, సతీష్ తెలిపారు. కార్యక్రమంలో మత్స్యకారులు సాయి, గంగాధర్, వినోద్ పాల్గొన్నారు.



కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

● మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



నిర్మల్‌లో..

నవతెలంగాణ-నిర్మల్, లక్ష్మణచాంద

అంధత్వంతో ఏ ఒక్కరూ బాధపడొద్దనే ఆలోచనతో సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టారని, ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. గురువారం గొల్లపేట, ఖురాన్ పేట్, బంగల్ పేట్‌లో రెండో విడుత కంటి వెలుగు కార్యక్రమాన్ని మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. స్వయంగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ శిబిరాలలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు, కండ్ల అద్దాలు ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. అవసరమైన వారికి ఉచితంగానే కంటి ఆపరేషన్‌లు చేయడం జరుగుతుందని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్స్, అంగన్‌వాడీలు, కార్యదర్శులు తమ ప్రాంతాల్లో విస్తృత ప్రచారం జరిపి ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా కృషి చేయాలని సూచించారు. కంటి పరీక్షలకు అందరూ వచ్చేవిధంగా ఫ్లెక్సీలు, చాటింపులు, కరపత్రాల ద్వారా ప్రతి ఒక్కరికీ ఆహ్వాన పత్రలను అందజేసి కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలన్నారు. కంటి వెలుగు వైద్య శిబిరానికి 18 సంవసరాలు పైబడిన ప్రతి ఒక్కరూ పాల్గొనేలా చూడాలన్నారు. ఎవరికి ఎలాంటి కంటి సమస్యలు ఉన్నా అత్యున్నత ప్రమాణాలతో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, కండ్ల అద్దాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం లక్ష్మణచాంద మండల కేంద్రంలోని ఉచిత కంటివైద్యశిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా రూ. 89లక్షలతో నూతనంగా నిర్మించే అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ, జెడ్పీచైర్‌పర్సన్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్, కంటి వెలుగు జిల్లా పరిశీలకులు సత్యనారాయణ, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, సర్పంచ్ ముత్యం రెడ్డి, విద్యా కమిటీ చైర్మెన్ సమ్మెట దశరథ్, జెడ్పీ సీఈఓ సుధీర్, డీఎంహెచ్‌ఓ ధనరాజ్, డీసీసీబీ వైస్ చైర్మెన్ రఘునందన్ రెడ్డి, ఎంపీడీఓ మోహన్, తహసీల్దార్ కవిత రెడ్డి, వైద్యులు శ్రీకాంత్, సురేష్, డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐ రాంనర్సింహా రెడ్డి, ఎస్సై రాహుల్ గైక్వాడ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ అర్బన్ : రెండో విడుత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గురువారం స్థానిక యువజన శిక్షణ కేంద్రంలో ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కంటివెలుగు కార్యక్రమం నిర్వహణకు 33 టీమ్‌లను ఏర్పాటు చేశామని అన్నారు. ఇందులో 27 గ్రామీణ ప్రాంతాల్లో, ఆరు పట్టణ ప్రాంతాల్లోని కేంద్రాలలో కంటి వెలుగు పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గతంలో కోవిడ్ వ్యాక్సినేషన్ ఇచ్చిన మాదిరిగానే కంటి వెలుగు కార్యక్రమ పరీక్షలకు ప్రణాళికలు రూపొందించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో వంద రోజుల పనిదినాలలో పరీక్షలను నిర్వహించి మందులు, కండ్ల అద్దాలు, అవసరమైన వారికి ప్రిస్క్రిప్టెడ్ కండ్లజోడు పంపించే ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పంచాయతీ, మున్సిపల్, మెడికల్, తదితర శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రజలకు వివరించి క్యాంపులకు హాజరయ్యే విధంగా సహకరించాలని కోరారు. మొదటి విడుత కంటి వెలుగులో 3.49 లక్షల మందికి స్క్రీనింగ్ నిర్వహించామని, ఈ దఫా మరింత ఎక్కువ మందికి పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మండల, వార్డు ప్రత్యేక అధికారులు పర్యవేక్షించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ ఇతర అవయవలోపం ఉన్నప్పటికీ సొంతంగా పనులు చేసుకోవచ్చని అన్నారు. కండ్లు లేని వారికీ పనులు చేసుకోవడం సులభతరం కాదని అన్నారు. ఆ దృష్టితోటె సీఎం దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి అమలు పరుస్తున్నారని తెలిపారు. 18వ తేదీన ఖమ్మం జిల్లాలో సీఎం కేసీఆర్ లాంఛనంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. రూ.250 కోట్ల వెచ్చించి ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్నదని అన్నారు. వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగ పరుచుకోవాలని అన్నారు. వంద రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలనీ అన్నారు. అంతకుముందు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. నరేందర్ రాథోడ్ కంటి వెలుగు కార్యక్రమంపై సంక్షిప్తంగా వివరించారు. అనంతరం క్యాంపును ప్రారంభించి కంటి పరీక్షలను నిర్వహించారు. వివిధ విభాగాలలో సిబ్బంది చేపట్టనున్న వివరాలు, లబ్ధిదారుల వివరాల నమోదు, కంటి పరీక్షలు, వైద్య సేవలు, కండ్లజోడు పంపిణీ, తదితర అంశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్, ట్రైనీ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, జాయింట్ డైరెక్టర్ (లెప్రసీ) జాన్‌బాబు, మున్సిపల్ కమీషనర్ శైలజ, స్థానిక కౌన్సిలర్ శ్రీలత, ఇతర ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌రూరల్ : రెండో విడుత ఉచిత కంటి వైద్య శిబిరాలను 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. గురువారం పట్టణంలోని మొదటి వార్డు గాంధీనగర్ కాలనీ, బస్తీ దావాఖాన వద్ద ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే నెల 5వ తేదీ వరకు ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రధానంగా వృద్ధులు కంటి పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనల మేరకు చికిత్సలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ వైస్ చైర్మెన్ అబ్దుల్ ఖలీల్, కౌన్సిలర్లు కావలి సంతోష్, తొంటి శ్రీను, తహసీల్దార్ రాజమోహన్, మున్సిపల్ కమిషనర్ రత్నాకర్‌రావులతో పాటు బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు తాళ్లపల్లి రాజ్ గంగన్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మెహరాజ్, వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, మెప్మా సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

కుభీర్ : ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేసుకునేలా చూడాలని ఎంపీపీ తూము లక్ష్మీబాయి, జెడ్పీటీసీ అల్కతాయి సంజయ్ అన్నారు. గురువారం మండలంలోని పార్డి(బి), మలేగాం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రెండో విడుత కంటి వెలుగు కార్యక్రమాలను స్థానిక సర్పంచులు మహిపాల్ రెడ్డి, పుష్పాలతతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కంటి వెలుగు కార్యక్రమం నేటి నుంచి వచ్చే నెల 6 వతేది వరకు ఈ గ్రామంలో కొనసాగుతుందన్నారు. కంటి పరీక్ష కేంద్రంలో ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ మోహియోద్దీన్ బీఆర్‌ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూము రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ శంకర్ చవాన్ రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు పుప్పాల పీరాజి, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ కందుర్ సంతోష్, స్థానిక సర్పంచ్ మహిపాల్ రెడ్డి, తహసీల్దార్ విశ్వరంబర్, ఎంపీఓ కవిరాజ్, మండల విద్యాధికారి చంద్రకాంత్, కుభీర్ ఎస్సై షరీఫ్, వైద్యులు సంతోష్, అవినాష్, ఆయా గ్రామల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు



ఆదిలాబాద్ రూరల్‌లో..



తలమడుగు మండలంలో..

తలమడుగు : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గురువారం కంటి మండలంలోని ఖోడద్, ఉండం గ్రామాల్లోని కంటి వెలుగు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ముందస్తుగా సమాచారం అందించి, క్యాంపు జరిగే ప్రదేశంలో హాజరయ్యే విధంగా అవగాహన కల్పించి కేంద్రానికి వచ్చే సమయంలో వారి ఆధార్ కార్డు వెంట తీసుకురావలసిందని తెలియజేయాలని అన్నారు. ప్రతి ఒక్కరికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు, కండ్ల జోడు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమాలలో డీఆర్డీఓ కిషన్, డీపీఓ శ్రీనివాస్, ప్రత్యేక అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీఓ రమాకాంత్, సర్పంచ్‌లు ఆనంద్, కంది పోచ్చుబాయి నర్సింలు, బీఆర్‌ఎస్ నాయకులు మహేష్, మల్లయ్య, డాక్టర్ రేష్మా, హరీశ్, పీఎంఓ విజయ్ కుమార్, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాధన పాల్గొన్నారు.

దిలావర్‌పూర్ : ప్రభుత్వం చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పాల్దె అక్షరఅనిల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదిక ప్రాంగణంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఎంపీపీ పాల్దె అక్షర అనిల్, సర్పంచ్ విరేష్ కుమార్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్దెనిమిదేండ్లు నిండిన ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తామని అన్నారు. కంటి పరీక్షలకు కావలసిన అన్ని రకాల వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయని, కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ విజయలక్ష్మీ, డాక్టర్ శ్యామ్‌కుమార్, ఎంపీటీసీ గంగవ్వ ముత్యంరెడ్డి, పీఎసీఎస్ చైర్మెన్ రమణ రెడ్డి, జెడ్పీకోఆప్షన్ సభ్యులు సుభాష్‌రావు, వైస్ ఎంపీపీ బాపురావు, మండల సర్పంచులు గంగారెడ్డి, మధుకర్, శ్రీనివాస్, ఒడ్నం కృష్ణ, కో ఆప్షన్ సభ్యుడు అన్వర్, ఎంఆర్‌ఓ కరీం, ఎంపీఓ అజీజ్ ఖాన్, ఎఓ శ్రవంతి, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఐకేపీ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశావర్కర్లు, నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్ : కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లావణ్య, ఎంపీడీఓ రాధా, వైస్ ఎంపీపీ శ్రీనివాస్, ఎంపీఓ మహేందర్ రెడ్డి, స్థానిక వైద్యులు డా.భీమ్‌రావు, శ్రావ్య వాణి, అలేఖ్య, వైద్య సిబ్బంది, ఏపీఎం గణేష్, పంచాయతీ కార్యదర్శి సునీల్, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నార్నూర్ : కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కనక మోతుబాయి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కావల రమేష్, ఎంపీఓ స్వప్న శీలా, సర్పంచ్ గజానంద్ నాయక్, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, పీఏసీఎస్ ఇన్‌ఛార్జి చైర్మెన్ సురేష్ ఆడే, ఫ్యాక్స్ డైరెక్టర్ కాంతారావ్ దుర్గే, ఎంపీటీసీ అబేదాఖానం, ఉపసర్పంచ్ మహేందర్, హెచ్‌ఈఓ నాందేవ్, పంచాయితీ కార్యదర్శి దినేష్ వైద్యసిబ్బంది ఉన్నారు.

బాసర : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ లక్ష్మణరావు, ఎంపీపీ సునీత విశ్వనాథ్ పటేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని శిశు మందిర్ పాఠశాల వద్ద ఏర్పాటుచేసిన కంటి వెలుగును కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ ఓని నర్సింగ్‌రావు, మండల బీఆర్‌ఎస్ కన్వీనర్ శ్యాంసుందర్, తహసీల్దార్ నారాయణ, ఎంపీడీఓ నాగనాథ్ ఆయా శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు గ్రామస్తులు పాల్గొన్నారు.

కేంద్ర రాపిడ్ యాక్షన్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలు తమ కార్యక్రమాలను ప్రారంభించినట్లు జిల్లా ఎస్పీ డి ఉదయ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ముందుగా యాక్షన్ బలగాలతో సమావేశమై కార్యచరణ ప్రకటించారు. అనంతరం హైదరాబాద్ 91వ రాపిడ్ యాక్షన్ బెటాలియన్ 80 మంది బలగాలు, జిల్లా ఎస్పీ డి ఉదయ్ కుమార్ రెడ్డి, అదనపు ఎస్పీ పరిపాలన శ్రీనివాసరావు, డీఎస్పీ వి.ఉమేందర్, ఆర్‌ఎఫ్ డీఎస్పీ శశాంక్‌తో కలిసి ర్యాలీని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ నుండి ప్రారంభించి, ర్యాలీగా వినాయకచౌక్, మసూద్‌చౌక్, ఖానాపూర్, బొక్కలగూడ, మసీద్, హనుమాన్ మందిరం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల ల మీదుగా కొనసాగి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ దగ్గర ముగిసింది. ఖానాపూర్ బొక్కలగూడ కాలనీలో ర్యాలీగా వస్తున్న కేంద్ర బలగాలను స్థానికులు పూలను జల్లి అభినందించారు. ఆదిలాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల బొక్కలగూడ, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు రాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఎటువంటి సమయాలలో విధులను నిర్వర్తిస్తుంది. మత కల్లోలాలు సంభవించినప్పుడు ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి, ప్రజలు ఎలా వ్యవహరించాలని, రాపిడ్ యాక్షన్ ఫోర్స్‌లోకి మహిళల పాత్రపై, ప్రజలకు ఎల్లవేళలా పోలీసులు అందుబాటులో ఉంటారని వివరించారు. వివిధ ముఖ్యమైన అంశాలపై అవగాహనను కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాల కవాతు గురువారం నుండి ఈ నెల 24 వరకు జిల్లాలోని ఆదిలాబాద్ పట్టణం, ఉట్నూర్, బోథ్, నేరడిగొండ, జైనథ్, ఇచ్చోడలలో వారం రోజులపాటు కొనసాగుతాయని తెలియజేశారు.

బీజేపీ జిల్లా అధ్యక్షురాలికి ఎమ్మార్పీఎస్ నాయకుల వినతి

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం కొరకు కేంద్ర పెద్దలను ఒప్పించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ శనిగారపు కమలాకర్ ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవికి వినతిపత్రం అందజేశారు. గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షురాలును కలిసి నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 28 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న పోరాటాలకు బీజేపీ మద్దతుగా నిలిచిందని అదే స్ఫూర్తితో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందేలా కేంద్రంలోని పెద్దలను స్థానిక బీజేపీ నాయకులు ఒత్తిడి తీసుకురావాలని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో బిక్కి మురళీకృష్ణ, ప్రణీత్, ప్రవీణ్, బద్రి, కళ్యాణలతో పాటు ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు బీమా పత్రాల సేకరణ

నవతెలంగాణ-కుభీర్

మండల కేంద్రానికి చెందిన లక్ష్మీ అనే రైతు ఇటీవల ఆనారోగ్యంతో మరణించింది. గురువారం బీఆర్‌ఎస్ నాయకులు రైతు బీమా పత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వివిధ కారణాలతో మరణించినట్లైతే వారి కుటుంబాలకు రూ.5లక్షలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా కార్యదర్శి పుప్పాల పీరాజి, పానాజీ విజయ్ కుమార్ వ్యవసాయ అధికారి రమేష్, గ్రామస్తులు ఉన్నారు.

వసంత పంచమి ఉత్సవ ఆహ్వాన పత్రిక ఆవిష్కరించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-బాసర

ఈనెల 26న బాసర సరస్వతి దేవి అమ్మవారి సన్నిధిలో నిర్వహించే వసంత పంచమి ఉత్సవాల ఆహ్వాన పత్రికను గురువారం దేగామలోని ఎమ్మెల్యే విఠల్ రెడ్డి నివాసంలో ఆవిష్కరించారు. వసంత పంచమి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. వీరి వెంట ఆలయ ఈఓ విజయ రామారావు, ఆలయ అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఆలయ ఈఓ

నవతెలంగాణ-బాసర

సరస్వతి దేవి అమ్మవారి సన్నిధిలో గురువారం ఆలయ ఈఓ విజయ రామారావు 2023 సంవత్సర నూతన క్యాలెండర్‌ను ఆలయ చైర్మెన్ శరత్ పాటక్‌తో కలిసి ఆవిష్కరించారు.

అంతర్‌రాష్ట్ర గంజాయి స్మగ్లర్లను అరెస్ట్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంతర్‌రాష్ట్ర గంజాయి స్మగ్లర్లను పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా గురువారం మావల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ రఘుపతి వివరాలు వెల్లడించారు. నార్నూర్ మండలానికి చెందిన ప్రశాంత్, మహారాష్ట్రకు చెందిన మిలద్ నిర్వతితో కలిసి గురువారం మధ్యాహ్నం ఆదిలాబాద్‌లోని తిరుమల పెట్రోల్ పంప్ దగ్గర ఆటో కోసం వేచి చూడగా జిల్లా కేంద్రం నుండి మహారాష్ట్రకు 8 కిలోల గంజాయి తరలిస్తుండగా సీసీఎస్, మావల పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు. జల్సాలకు అలవాటు పడి తక్కువ సమయంలో ఎక్కడ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి స్మగ్లింగ్ అలవాటు పడ్డారన్నారు. లభించిన గంజాయి ప్యాకెట్లను పంచుల సమక్షంలో జప్తు చేశామన్నారు. ఈ సమావేశంలో ఎస్సైలు విష్ణువర్ధన్, ఇసాక్ సిబ్బంది ఉన్నారు.

'బీఆర్‌ఎస్ అభివృద్ధి ఎక్కడ చేసింది'

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఆదిలాబాద్‌లోని పలు వార్డుల్లో కనీసం మురికి కాలువలు నిర్మించలేదని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం అభివృద్ధి ఎక్కడ చేసిందో చెప్పాలంటూ బీజేపీ రాష్ట్ర నాయకురాలు చిట్యాల సుహాసినిరెడ్డి ప్రశ్నించారు. గురువారం పట్టణంలోని పలు వార్డులలో పర్యటించారు. మున్సిపాలిటీ పరిధిలోని సోనార్ గల్లిని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీలో కాలినడకన తిరుగుతూ ప్రజలతో మాట్లాడి కాలనివాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రూ.4 వేల కోట్లతో అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటున్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కనీస మౌలిక వసతులు కల్పించలేదంటే వారి అభివృద్ధి ఎలా ఉందో అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పలువు బీజేపీ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఉషు క్రీడలో ఆదిలాబాద్ యువతికి మూడో స్థానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల కేరళలో జరిగిన సౌత్ జోన్ స్థాయిలో ఉషు క్రీడా పోటీల్లో ఆదిలాబాద్ పట్టణానికి చెందిన క్రీడాకారిణి వనిత రాథోడ్ 3వ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలో ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బాలూరి గోవర్ధన్ రెడ్డి ఆమె ను శాలువతో సత్కరించి అభినందించారు. ఈ మేరకు గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఖేలో ఇండియా క్రీడా పోటీల్లో భాగంగా ఉషు సీనియర్ సౌత్ జోన్ స్థాయి పోటీల్లో వనిత రాథోడ్ 3వ స్థానంలో నిలవడం జిల్లాకే గర్వకారణమని అన్నారు. నేషనల్ స్థాయిలో తెలంగాణ నుండి ఇద్దరు క్రీడాకారులు ఎంపిక అయ్యారని అందులో వనిత ఒకరని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో జిల్లాకు మరిన్ని పథకాలను సాధిస్తూ, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆమెకు శిక్షణను ఇస్తున్న కోచ్ విరేశ్‌ను అభినందించారు.

మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా అసిమోద్దీన్



నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్

బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా జనరల్ సెక్రటరీగా మహ్మద్ అసిమోద్దీన్ నియమితులయ్యారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయనకు జిల్లా అధ్యక్షులు పాయల్ శంకర్ నియామక పత్రాన్ని అందజేసి, అభినందనలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు ముజాహిద్, నాయకులు ముకుందరావు, భూమారెడ్డి పాల్గొన్నారు.

శిశువుల సంరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

● సీడీపీఓ నాగలక్ష్మి

నవతెలంగాణ-భైంసా

నవజాత శిశువుల సంరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని భైంసా సీడీపీఓ నాగలక్ష్మి సూచించారు. గురువారం ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లకు శిశువుల సంరక్షణ పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నెలలు నిండని వారిని గుర్తించి వారు ఆరోగ్యంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత టీచర్లదేనని అన్నారు. ఆరు నెలల నిండిన శిశువుకు ఆహారాన్ని అందించాల్సిన పద్ధతులను ఆమె వివరించారు. అతి తీవ్ర పోషక లోపం ఉన్న శిశువులను గుర్తించి బరువుతూకం వేయాలన్నారు. రెండు కిలోల కంటే తక్కువ ఉన్న చిన్నారులను గుర్తించి వారికి పోషకాహారం అందివ్వడంతో పాటు ఆకలి టెస్టులను నిర్వహించాలన్నారు. లోపాలను గుర్తించి వారిని వైద్యుల వద్దకు తీసుకెళ్లేలా చూడాల్సిన బాధ్యత అంగన్‌వాడి టీచర్లు తీసుకోవాలన్నారు. అనారోగ్యం బారిన పడిన చిన్నారులకు లిక్విడ్ రూపంలో ఆహారాన్ని అందించేలా చూడాలన్నారు. చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేలా తల్లులకు అవగాహన



కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజశ్రీ, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-తాంసి

రైతులతో పాటు మారుమూల గ్రామీణ ప్రాంతాలలో నివసించే ప్రజలు లోక్ అదాలత్‌పై అవగాహన కలిగి ఉండి, లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షేమాదేశ్‌పాండే అన్నారు. గురువారం భీంపూర్ మండల కేంద్రంలోని అంగడి బజార్‌లో పలు గ్రామాల రైతులకు, ప్రజలకు న్యాయ సేవా, లోక్ అదాలత్ వినియోగంపై అవగాహణ, న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుమూల గ్రామీణ ప్రాంతాలలో నివసించే ప్రజలు వ్యవసాయదారులు లోక్ అదాలత్‌పై అవగాహన కలిగి ఉంటే ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. రిజర్వుబ్యాంక్ వారి మార్గదర్శకాల ప్రకారం రైతులు పంట రుణాలతో పాటు వ్యవయ అభివృద్ధికి అవసరమైన దీర్ఘకాలిక అప్పు పొందడం ఒక హక్కు అన్నారు. బ్యాంకుల్లో రైతులు తీసుకున్న ఋణాలు సకాలంలో తిరిగి చెల్లిస్తే, రుణ పెంపుకు అవకాశం ఉంటుందని అన్నారు. రైతులు రుణ చెల్లింపులో అలస్యం ఎదురైతే లోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చని అన్నారు. రైతులతో సహా మహిళలు నిస్సహాయ పరిస్థితుల్లో ఉన్నా వారు పేదరికంలో ఉన్న వారికి న్యాయ స్థానము సహాయం అందిస్తుందని అన్నారు. చదువుకున్న యువకులు తమ గ్రామంలో ఉన్న ప్రజలకు రైతులకు లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లింబాజీ, జెడ్పీటీసీ సుధాకర్, తహసీల్దార్ మహేంద్రనాథ్, బ్యాంక్ మేనేజర్ ప్రసాద్, అడ్వొకేట్ బద్రీశ్వర్‌రావు పాల్గొన్నారు.

శ్రీరామ్ సేన ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్ రక్తనిధి కేంద్రంలో శ్రీరామ్ సేన ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సంఘం ఉపాధ్యక్షులైన పెద్దవారు శశికాంత్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 40 యూనిట్ల రక్తదానం చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ రాజలక్ష్మి, బండారి కృష్ణ, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, సతీష్ రెడ్డి, నర్సారెడ్డి, సూర్యనారాయణ, సులేమాన్, ప్రభాకర్, మీర్జా బిపాషా, శ్రీరామసేన అధ్యక్షుడు లోకండే అనిల్, మడిపల్లి ప్రమోద్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని రేండ్లగూడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, అల్లం మల్లయ్య, మందపల్లి ప్రధాన రహదారి ప్రమాదంలో గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించగా విషయం తెల్సుకున్న ఉట్నూర్ జడ్పీటీసీ చారులత రాథోడ్ గురువారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోర్లకుంట ప్రభుదాస్, ప్రధాన కార్యదర్శి ఫాసి ఉల్లు, ఉపాధ్యక్షులు అంబటిపల్లి మహేష్, ఆదిలాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగంపల్లి చంద్రయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అల్లం లచ్చన్న, ఉట్నూర్ మండల్ బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఇక్బల్, యువజన కాంగ్రెస్ నాయకుడు బానోత్ రోహిదాస్ ఉన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని కర్జవెల్లి గ్రామంలో చత్ర పతి శివాజీ మహరాజ్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసాయి. ఎంపీపీ డుబ్బుల నానయ్య, సర్పంచ్ చౌదరి నానయ్య , డోకే రాజన్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాగజ్‌నగర్, ఆరెకుల సంఘం మండల అధ్యక్షులు టీ. శ్రీనివాస్ ల చేతుల మీదుగా మొదటి బహుమతిగా ట్రోఫీతో పాటు రూ.30 వేలు విజేత కుకుడా గ్రమ జట్టుకుకు అందజేశారు. కార్యక్రమంలో చత్రపతి శివాజీ మహారాజ్ కర్జవెల్లి యూత్ కమిటీ, ఎంపీటీసీ చౌదరి కల్పన రంగన్న, మాజీ సర్పంచ్ భీమయ్య, ఉప సర్పంచ్ నాయిని భీమయ్య, చౌదరి హరి, చంద్రశేఖర్, లక్ష్మణ్, నారాయణ, గణేష్ , శంకరయ్య, తిరుపతి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో విద్యారంగంలో పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించాలని విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో గురువారం జిల్లా విద్యాధికారి అశోక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యల పరిష్కారానికై మన ఊరు-మన బడి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని, కానీ జిల్లాలో నాసిరకంగా పనులు చేస్తూ ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. అదేవిధంగా జిల్లాలో ఉన్న అన్ని ఏకోపాధ్యాయ పాఠశాలలలో ఉపాధ్యాయులు సమయపాలనను పాటించకపోగా పాఠశాలలకు కూడా వెళ్లడం లేదని దీంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్న పరిస్థితి ఉందన్నారు. జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర పోస్టులను భర్తీ చేయాలని, కాగజ్‌నగర్ కేజీబీవీ పాఠశాలలో మరణించిన విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తీక్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి జగజంపుల తిరుపతి, టీఎస్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పోల్కార్ సాయిరాం, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గుండా శ్యాం పాల్గొన్నారు.

కాసిపేట గనిపై టీబీజీకేఎస్ గేట్ మీటింగ్

నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిపై టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో గురువారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సంధర్భంగా మందమర్రి ఏరియా ఉపాధ్యక్షులు మేడిపల్లి సంపత్ మాట్లాడుతూ లాభాల వాటాను ప్రతి సంవత్సరం కొంత శాతం పెంచి సీఎం కేసీఆర్ ఇప్పిస్తున్నారన్నారు. జాతీయ సంఘాలు మాత్రం గత వేజ్ బోర్డ్ కంటే తక్కువ అగ్రిమెంట్ చేయడం విడ్డూరమన్నారు. సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం టీబీజీకేఎస్‌తోనే సాధ్యమని, జాతీయ సంఘాలు పోగొట్టిన తండ్రి కొడుకుల ఉద్యోగం తిరిగి ఇప్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. జాతీయ సంఘాలు గోల్డెన్ షేకండ్ కింద 20 వేల కార్మికులను బలవంతంగా ఇంటికి పంపితే, 19 వేల కొత్త ఉద్యోగులు టీబీజీకేఎస్, కేసీఆర్ ఇప్పించారన్నారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ రీజియన్ కార్యదర్శి రాజశేఖర్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ బడికెల సంపత్, ఏరియా నాయకులు వొడ్నాల రాజన్న, ఫిట్ సహాయ కార్యదర్శి బైరి శంకర్, వర్క్ మెన్ ఇన్‌స్పెక్టర్ చొల్లంగి శ్రీనివాస్, నాయకులు అఫలోరిన్, లక్ష్మణాదాస్, బండారి రమేశ్, డొమ్మెటి రమేశ్, కృష్ణ, శివ, సతీష్ యాదవ్, రాగుల సతీష్ పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ పనుల పరిశీలన



నవతెలంగాణ-వేమనపల్లి

మండలంలోని కకల్లంపల్లి గ్రామ పంచాయతీని ఎంపీఓ శ్రీపతి బాపురావు బుధవారం మొబైల్ ఆప్ ద్వారా తనిఖీ చేశారు. ప్రతి రోజు ఉదయం ఏడు గంటలకు విధులకు హాజరై శానిటేషన్ పనులను విస్తృతంగా చేపట్టి, డైలీ శానిటేషన్ రిపోర్ట్‌ను మొబైల్ ఆప్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి రోజు ట్రాక్టర్ ద్వారా చెత్తను సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించి చెత్తను వేరు చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, రోడ్లపై చెత్త, కర్రలు, బండలు లేకుండా చూడాలని, హరిత హారం మొక్కలు 100 శాతం బ్రతికేల చర్యలు చేపట్టాలని, వాటర్ ట్యాంక్ లను క్లీనింగ్ చేసి రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ రికార్డులను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని గ్రామ పంచాయతీ ద్వారా జారీ చేయబడి ధృవీకరణ పత్రాలను వెంటనే జారీ చేయాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రతి రెండు నెలలకొకసారి గ్రామ సభ, ప్రతి నెల పంచాయతి మీటింగ్ నిర్వహించాలన్నారు. గ్రామ సభలకు, మీటింగ్‌లకు స్టాండింగ్ కమిటీ సభ్యులు హాజరయ్యేలా చూడాలన్నారు. ఇంటి పన్నులను 100 శాతం వసూలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి ఉదయకుమార్, ఎంపీడీఓ లక్ష్మయ్య, పంచాయితీ కార్యదర్శి సుదర్శన్ పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలి

- సీనియర్ సివిల్ జడ్జి ఉమామహేశ్వరి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జ్ ఉమామహేశ్వరి అన్నారు. మండలంలోని మొతుగూడ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో మాదిరి కాకుండా ప్రస్తుతం ఆన్‌లైన్ విధానంలో కోర్టు సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎవరైనా కోర్టులో తమ తరఫున లాయర్‌లను పెట్టుకోలేని పరిస్థితిలో ఉంటే వారికి ఉచిత న్యాయ సహకారం లభిస్తుందని దీనిని ప్రజలు వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు విద్యాసాగర్, రాజీవ్ రెడ్డి, నరహరి, ఎస్సై రమేష్ పాల్గొన్నారు.



అంధత్వరహిత రాష్ట్రమే ప్రభుత్వ లక్ష్యం

- జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి
- జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అంధత్వరహిత రాష్ట్రమే తమ ప్రభుత్వ లక్ష్యమని జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి పునరుద్ఘాటించారు. గురువారం మండలంలోని చిర్రకుంట గ్రామంలో ఏర్పాటుచేసిన రెండవ విడత కంటి వెలుగు ప్రారంభోత్సవానికి ఆసిఫాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఎస్పీ సురేష్ కుమార్‌తో కలిసి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రెండు కోట్ల మందికి కంటి పరీక్షలు నిర్వహించే లక్ష్యంతో కార్యక్రమం ప్రారంభించినట్లు వివరించారు. జిల్లాలో ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అవసరమైన పరికరాలు అందజేయనున్నట్లు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహణకు 26 బృందాలు, ఒక అదనపు బృందాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వాహనాలు, 26 ఏఆర్ మిషన్లు, ట్రయల్ లెన్స్ బాక్సులు, స్నెల్, విజన్ చార్ట్‌లు, కంటి వెలుగు కిట్లు, ట్యాబ్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అందిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే ఆత్రం సక్కు కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్, మార్కెట్ కమిటీ చైర్మన్ గాధవేని మల్లేష్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, డీఎస్పీ శ్రీనివాస్, డాక్టర్ సత్యనారాయణ, సర్పంచ్ విమలబాయ్, ఉప సర్పంచ్ సత్యనారాయణ, ఎంపీటీసీ రమేష్ పాల్గొన్నారు.

కోటపల్లి : మండలంలోనీ సర్వాయిపేట గ్రామంలో గురువారం జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం 100 రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు నల్లాల ఓదెలు, డీఆర్‌డీఓ శేషాద్రి, ఎంపీడీఓ భాస్కర్, డాక్టర్ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి శేఖర్, స్థానిక సర్పంచ్ పసునుతి వసంతి కుమారి, ఉప సర్పంచ్ లచక్క, నాయకులు ధనంజయ్, సతీష్ పాల్గొన్నారు.

హాజీపూర్ : మండలంలోని దోనబండలో ఏర్పాటు చేసిన రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ మందపల్లి స్వర్ణలత-శ్రీనివాస్, అదనపు కలెక్టర్ రాహుల్ హాజరయ్యారు. శిబిరంలో ఏర్పాటు చేసి సౌకర్యాల విషయంలో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కంటి పరీక్షకు వస్తున్న వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సర్పంచ్, కార్యదర్శిని ఆదేశించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు కంటి వెలుగు కేంద్రాలను తనిఖీ చేస్తూ రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజలింగం, ఎంపీడీఓ మహ్మద్ అబ్దుల్ హై, మండల ప్రత్యేక అధికారి రవీందర్, మండల వైద్యాధికారిని లహరి, సర్పంచ్ జాడి సత్యం పాల్గొన్నారు.

దండేపల్లి : మండలంలోని తాళ్లపెట్ గ్రామంలో గురువారం మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు స్థానిక నాయకులు కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల కొరకు సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమంతో చీకటి బ్రతుకుల్లో కొత్త వెలుగు నింపేందుకు ఈ పథకం ప్రవేశ పెట్టారని ప్రతి ఒక్కరికి ఇక్కడ ఉచితంగా పరీక్షలు జరిపి అవసరం ఉన్న వారికీ కాళ్ళ అద్దాలు ఇవ్వతో పాటు అవసరం అయిన వారికి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ మోటపలుకుల గురువయ్య, సర్పంచ్ కళావతి, ఉప సర్పంచ్ పుట్టపాక తిరుపతి, వైస్ ఎంపీపీ అనిల్, మాజీ వైస్ ఎంపీపీ ఆకుల రాజేందర్ పాల్గొన్నారు.

భీమారం : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని గురువాం కలెక్టర్ భారతి హోళికేరి పరిశీలించారు. ప్రభుత్వం చేపడుతున్న కంటి పరీక్షలతో ప్రజలకు నమ్మకం కలగాలన్నారు. అదేవిధంగా పరీక్ష్యా కేంద్రాల్లో ఎప్పటికప్పుడు ఏర్పాట్లు సమీక్షించుకోవాలని సంబంధిత అధికారులను అధేశించారు. అనంతరం ప్రజలతో మమేకమై కంటి శిబిరం నిర్వాహనను పరిశీలించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ గౌతమి, డిప్యూటీ సీఈఓ లక్ష్మీనారాయణ, తహసీల్దార్ వాసంతి, ఎంపీడీఓ శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ గద్దె రాంరెడ్డి పాల్గొన్నారు.

కాసిపేట : మండలంలోని గట్రావ్‌పల్లి, బుగ్గగూడెం గ్రామ పంచాయతీల్లో గురువారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. గట్రావ్పల్లిలో ఎంపీపీ రొడ్డ లక్ష్మీ, బుగ్గగూడెంలో జడ్పీటీసీ పల్లె చంద్రయ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. బుగ్గగూడెం కేంద్రాన్ని కార్యక్రమ రాష్ట్ర నోడల్ అధికారి శ్రీనివాసరావు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంఎ అలీం, తహసీల్దార్ దిలీప్ కుమార్, ఎస్ఎస్ఐలు గంగారాం, విజయేందర్, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, ఎంపీఓ నాగరాజు, సర్పంచ్ ఆడె బాదు, పెంద్రం రాజు, విజయలక్ష్మీ, ఎంపీటీసీలు కొండబత్తుల రాంచందర్, చంద్రమోళి, భీంరావు పాల్గొన్నారు.

జన్నారం : ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ఎంపీపీ మాదాడి సరోజన అన్నారు. గురువారం మండలంలోని ఇందన్‌పల్లి, జన్నారం, పోన్కల్, గ్రామపంచాయతీ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ రమేష్, సర్పంచ్ భూషణ వేణి గంగాధర్ గౌడ్, పోన్కల్ గ్రామపంచాయతీలో ఆర్టీఓ వేణు సర్పంచ్ జక్కు భూమేష్, మండల వైద్యాధికారి డాక్టర్ ఉషశ్రీ, ఎంపీడీఓ అరుణారాణి పాల్గొన్నారు.

నస్పూర్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. 9వ వార్డులో మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, నస్పూర్ మనోరంజన్ సముదాయంలో వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, శ్రీరాంపూర్ లోని ప్రగతి మైదానంలో సీడీపీఓ హేమ సత్య ప్రారంభించారు. ఈ శిబిరాలను మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు సందర్శించారు.

తాండూర్ : మండలంలోని కాసిపేట, గోపాల్‌నగర్ పంచాయతీలలో కంటి వెలుగు కార్యక్రమాన్ని స్పెషల్ ఆఫీసర్ గజానంద్, ఎంపీపీ పూసల ప్రణయ్ కుమార్ ప్రారంభించారు. ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ తహసీల్దార్ కవిత కాసిపేట సర్పంచ్ అస్ప రమేష్, గోపాల్ నగర్ సర్పంచ్ గజ్జల బతుకమ్మ, వైద్యాధికారి కుమారస్వామి హాజరయ్యారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కాసపేట పంచాయతీలో 150 మందికి పరీక్షలు నిర్వహించగా 54 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాసిపేట పంచాయతీ సెక్రెటరీ సాయి తేజ గోపాల్ నగర్ పంచాయతీ సెక్రెటరీ వసంత పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్ : స్థానిక ఒకటవ వార్డు తారకరామ కాలనీలోని డివినిటీ పాఠశాలలో గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ హాజరయ్యారు. కార్యక్రమములో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎర్రం విద్యాసాగర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జి.వెంకట నారాయణ, కౌన్సిలర్లు, డాక్టర్ మానస, డాక్టర్ శ్యామల పాటిల్ పాల్గొన్నారు.

వేమనపల్లి : మండల కేంద్రములోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ కోళి స్వర్ణలత ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మయ్య, తహసీల్దార్ రాజ్ కుమార్, జడ్పీటీసీ రుద్రభట్ల స్వర్ణలత, ఎంపీటీసీ రుద్రభట్ల సంతోష్ కుమార్, కోఆప్షన్ సభ్యుడు జాహేద్ అలీ పాల్గొన్నారు.


హాజీపూర్‌లో...


భీమారంలో...


నస్పూర్‌లో...


కాసిపేటలో...

శ్మశాన వాటికకు వెళ్లే దారి కబ్జా..!

- ఆసిఫాబాద్‌లో మితిమీరుతున్న భూకబ్జాలు
- అధికార పార్టీ నాయకుల హస్తం ఉన్నట్లు ఆరోపణలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ కుమురంభీం జిల్లా ఏర్పడిన నేపథ్యంలో భూముల రేటు పెరగటంతో భూ కబ్జాలు వితిమీరుతున్నాయి. ఎక్కడ కాలీ స్థలం కనిపించిన రియలెస్టేటర్లు కబ్జాలకు పాలుపడుతున్నారు. జిల్లా కేంద్రంలోని దస్నాపూర్ వాసులు స్మశాన వాటిక వెళ్లే దారి రియల్ ఎస్టేట్ వ్యాపారి కబ్జాకు ప్రయత్నిస్తున్నారు. వివరాల్లోకి వెళితే జిల్లా కేంద్రంలో భూముల ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో ఏ కొద్దీ స్థలం దొరికిన కబ్జా చేస్తున్నారు. ఈ క్రమంలోనే పాత ఆర్టీఓ కార్యాలయం వెనకాల వెంచర్ పక్కన దస్నాపూర్‌ను అనుకొని ఒక పెద్ద ఒర్రె ఉంది. దీని ఒడ్డు నుంచి దస్నాపూర్‌కు చెందిన వారు ఎవరైనా మరణిస్తే స్మశాన వాటికకు వెళ్లడానికి, అటువైపు పంట పొలాలు ఉన్న రైతులు వెళ్లడానికి 30 ఫీట్ల రహదారి ఉంది. తాజాగా ఒర్రెకు ఇవతలి వైపు వెంచర్ వేసిన వ్యక్తి తన ప్లాట్లకు ఒర్రె అడ్డం వస్తుందని దానిని మరల్చే ప్రయత్నం చేశారు. ఈ నెల 14వ తేదీన డోజర్ సహాయంతో పెద్ద ఎత్తున రహదారి తవ్వారు. విషయం తెలుసుకున్న దస్నాపూర్ వాసులు సంఘటన స్థలం వద్దకు వెళ్లి గొడవ చేసి పని ఆపారు. అయితే అప్పటి మట్టుకు పని ఆపి రాత్రిపూట పని చేస్తున్నట్లు కాలనీవాసులు చెబుతున్నారు. ఇదే జరిగితే ఒర్రె అవతలి వైపు గతంలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు రోడ్డు లేక ఇబ్బంది పడాల్సి వస్తుంది. అలాగే దస్నాపూర్ వాసులు స్మశాన వాటికకు వెళ్లడానికి రోడ్డు లేకుండా పోతుంది. కాలనీవాసులు అడ్డం తిరగడంతో తోడిన మట్టి తిరిగి పూడ్చి వేస్తామని వెంచర్ యజమాని హామీ ఇచ్చినప్పటికీ వారం రోజులు గడుస్తున్న కనీసం దానిని తిరిగి నింపడం లేదు. ఈ వ్యవహారంలో అధికార పార్టీకి చెందిన నాయకుల హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదంతా తెలిసినప్పటికీ అధికారులు కూడా మట్టి తిరిగి నింపించడానికి, అక్రమంగా కబ్జా చేయడానికి ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఏది ఏమైనా జిల్లా కేంద్రంలో కబ్జాదారులు ఆగడాలు మితిమీరుతున్నాయనడానికి ఇది నిర్శనంగా నిలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్మశాన వాటికకు వెళ్లి రహదారి కబ్జాకు గురికాకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

గురుకులాల ఆర్సీఓపై ఆగ్రహం

- అధికారుల పనితీరు మార్చుకోవాలని హితవు
- జడ్పీ స్థాయి సంఘాల సమావేశాల్లో సభ్యుల మండిపాటు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజా ప్రతినిధులు ఫోన్లు చేస్తే కూడా స్పందించని గురుకులాల ఆర్సిఓపై జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవలక్ష్మితో సహా ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం జడ్పీ కార్యాలయంలో స్థాయి సంఘాల సమావేశాలను జడ్పీ సీఈఓ రత్నమాల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల సమీక్షలో భాగంగా అధికారుల పని తీరు మార్చుకోవాలని అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని సభ్యులు మండిపడ్డారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ గురుకులాలలో 22 సీట్లు ఖాళీగా ఉన్నప్పటికీ ఆర్సిఓ కనీసం స్పందించడం లేదని ఇది సరైన విధానం కాదని ఆక్షేపించారు. ఆసిఫాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సులు కాగజ్‌నగర్ మీదుగా వెళ్లడంతో ప్రయాణికులకు దూర భారం పెరగడంతో పాటు సమయం డబ్బు వృధా అవుతుందని అన్నారు. అలా కాకుండా హైదరాబాద్ బస్సు సమయాలలో కాగజ్‌నగర్ నుంచి ప్రత్యేకంగా క్రాస్ రోడ్ వరకు లింకు బస్సులు నడపాలని అలా కాని పక్షంలో ఒకటి రెండు బస్సులు మాత్రమే కాగజ్‌నగర్ మీదుగా వెళ్లేలా చూడాలని సూచించారు. జిల్లా కేంద్రం, కాగజ్‌నగర్ నుంచి మంచిర్యాలకు కాల్ టెక్స్ మీదుగా బస్సులు నడిపేలా చూడాలన్నారు. వికలాంగుల సంక్షేమ శాఖ ద్వారా వికలాంగులకు స్కూటీలు బ్యాటరీ సైకిల్స్ ఇవ్వడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. మహిళా శిశు సంక్షేమ శాఖలో ఖాళీలను స్థానికులతో భర్తీ చేయాలన్నారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టం ద్వారా ప్రతి ఒక్కరికి పని కల్పించేలా చూడాలన్నారు. సంక్షేమ పథకాలు అమలులో ప్రజాప్రతినిధులను కలుపుకొని వెళ్లాలని సూచించారు. రెబ్బెన మండలంలోని మాధవాయిగూడకు బస్సు సౌకర్యం కల్పించాలని మండల కేంద్రంలో తక్కలపల్లిలో బస్టాండ్‌లు నిర్మించాలని ఆ మండల జడ్పీటీసీ సంతోష్ కోరారు. ఆదిలాబాద్ నుంచి ఆసిఫాబాద్‌కు వయా లోకారి నుండి బస్సు సౌకర్యం కల్పించాలని కెరమెరి జడ్పీటీసీ ధృపదాబాయి కోరింది. కోయవాగు అంగన్‌వాడీ సెంటర్ ఖాళీ చేయమని అక్కడి పాఠశాల వారు ఒత్తిడి తీసుకువస్తున్నారని, దానికి సరైన స్థలం చూపాలని కోఆప్షన్ సభ్యుడు సిద్ధిక్ కోరారు. మొత్తం 7 స్థాయి సంఘాల గాను వ్యవసాయం, అటవీ, మత్స్యశాఖ స్థాయి సంఘాలను జడ్పి వైస్ చైర్మన్ కృష్ణారావు సమీక్ష చేయగా మిగతా వాటిని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవలక్ష్మి సమీక్ష చేశారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు



నవతెలంగాణ-జన్నారం

దేశం, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పేదలు ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా అభివృద్ధి చెందుతారని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు, ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు, ఉట్నూర్ జడ్పీటీసీ చారులతా రాథోడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని, కాంగ్రెస్ మండల విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరై వారు మాట్లాడారు. ఈ నెల 26న రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న చోడో యాత్ర కార్యక్రమం ముగుస్తున్న సందర్భంలో, అదే 26వ తేదీ నుంచి ప్రతి గ్రామంలో కాంగ్రెస్ హాత్సేహాత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి గ్రామంలో ఉన్న కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలపాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కేంద్రంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడానికి ప్రతి కార్యకర్త నాయకుడు కంకణ బద్ధులై పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోర్లకుంట ప్రభుదాస్, ఉపాధ్యక్షులు అంబటపెల్లి మహేష్, ప్రధాన కార్యదర్శి ఫసీఉల్లా, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు నందు నాయక్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బీరవేణి రాజన్న, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మామిడిపల్లి ఇందయ్య, పట్టణ అధ్యక్షుడు దుమల రమేష్, అధికార ప్రతినిధి అల్లం వెంకటరాజ్యం, యువజన నాయకులు ఇమ్రాన్, ఎస్టీ సెల్ నాయకులు తిరుపతి, వార్డు సభ్యులు గంగన్న, నాయకులు మాణిక్యం, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో పంటల నమోదు

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని బాబాపుర్, లంబాడిపెట్టి గ్రామాల్లో యాసంగి సాగుచేసిన పంటల వివరాలను జిల్లా వ్యవసాయాధికారి రావూరి శ్రీనివాస్‌రావ్ పరిశీలించి క్రాప్ బుకింగ్ ఆప్‌లో నమోదు చేశారు. యసంగి పంటలు వేసిన ప్రతి రైతు పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. దీని ఆధారంగ పంటల సాగు విస్తీర్ణం, దిగుబడి గుర్తుంచు కోవచ్చు అన్నారు. అంతే కాకుండా ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించేందుకు, రైతులు పంటలు అమ్ముకునేందు ఇది ఎంతగానో ఉపయోగ పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయా అధికారి రామకృష్ణ, ఏఈఓ రాజేశ్వర్ పాల్గొన్నారు.

అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శుక్రవారం 20 జనవరి 2023

చిరుధాన్యాలతోనే ఆరోగ్యం

పెంచికల్‌పేట్ : చిరుధాన్యాలు తినడంతో ఆరోగ్యం మెరుగవుతుందని కమ్మర్‌గాం సర్పంచ్ పొరిశెట్టి మధునయ్య అన్నారు. మండలంలోని కమ్మర్‌గాం గ్రామంలో అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా మండల వ్యవసాయాధికారి రాజుల నాయుడు ఆధ్వర్యంలో గ్రామంలో రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు చిరుధాన్యాల ప్రాముఖ్యతను తెలియజేశారు. సజ్జలు, జొన్నలు, సామలు, రాగులు వంటి చిరుధాన్యాలను తింటే జీర్ణ సమస్యలు, రక్తహీనత, ప్లేగు క్యాన్సర్ వంటివి రాకుండా చూసుకోవచ్చున్నారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీవిద్య, ఎంపీటీసీ పేదం శారద, గ్రామ రైతు కమిటీ సభ్యుడు తలండి బాపురావు, రైతులు పాల్గొన్నారు.



ఎంపీపీ చెక్కు అందజేత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని లాండసాంగ్వి గ్రామానికి చెందిన గేడం ఉద్ధవ్ కూతురు శిల్పకు రూ.2లక్షల ప్రమాద బీమా చెక్కును ఎంపీపీ గండ్రత్ రమేష్ బీఆర్ఎస్ తరపున అందజేశారు. ఉద్ధవ్ గతేడాది పిండి గిర్నీలో పడి మరణించారు. ఎమ్మెల్యే జోగు రామన్న ఆదేశానుసారం చెక్కును అందజేశామని ఎంపీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ జిట్ట రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పరమేశ్వర్, సర్పంచ్ సువర్ణశ్రీనివాష్, నాయకులు సేవ్వ జగదీష్, కనక రమణ మోతీరాం, బుచ్చన్న, కోఆప్షన్ సభ్యులు ఆరిఫ్ పాల్గొన్నారు.



క్రీడలతో మానసికోల్లాసం

- ముగిసిన అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు
- ఎమ్మెల్యే బాపురావు బహుమతులు ప్రదానం



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక దృఢత్వం కలుగుతుందని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో భారత్ రాష్ట్ర సమితి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందన్నారు. యువత తలచుకుంటే ఏదైనా సాధించవచ్చని అన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాలు దినదినాభివృద్ధి చెందుతున్న తరుణంలో గ్రామీణ క్రీడలు కనబడకపోవడం బాధాకరమన్నారు. యువత చదువుతో పాటు క్రీడ, రాజకీయ రంగాల్లో రాణించాలని తెలిపారు. క్రీడల్లో చురుగ్గా పాల్గొని మానసికంగా, ఆరోగ్యంగా జీవితాన్ని కొనసాగించాలని తెలిపారు. చెడు వ్యసనాలకు బానిస కాకుండా దేశ అభివృద్ధి గురించి ఆలోచించాలన్నారు. హోరాహోరీగా సాగిన కబడ్డీ పోటీల్లో గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. బజార్‌హత్నూర్ జట్టు మొదటి బహుమతి రూ.30వేలు, డెడ్రా జట్టు రెండవ బహుమతి రూ.15వేలు, మోహద జట్టు మూడవ బహుమతి రూ.5వేలు గెల్చుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ పర్చ లావణ్య, నియోజకవర్గ యువ నాయకులు రాథోడ్ విశ్వజిత్ నాయక్, బీఆర్ఎస్ నాయకులు రాథోడ్ సూర్యప్రకాష్, నియోజకవర్గ అధికార ప్రతినిధి మెట్టె కిరణ్, బోథ్ మార్కెట్ కమిటీ అధ్యక్షులు సోలంకి రుక్మన్‌సింగ్, మండల పార్టీ అధ్యక్షులు కానిందే రాజారామ్, తలమడుగు మండల అధ్యక్షులు తోట వెంకటేశ్, జిల్లా రైతుబంధు సమితి డైరెక్టర్ నర్సిరెడ్డి, మండల బీసీ సెల్ అధ్యక్షులు అంకుష్, మండల మైనారిటీ సెల్ అధ్యక్షులు రియాజ్ ఖాన్, మండల యూత్ అధ్యక్షుడు డుబ్బుల చంద్రశేఖర్, మండల నాయకులు కవిందర్, అందే ప్రకాష్, కోడారి నరేష్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బాసర ఆలయ హుండీ ఆదాయం రూ.53లక్షలు

నవతెలంగాణ-బాసర

సరస్వతి దేవి అమ్మవారికి భక్తులు సమర్పించిన హుండీ కానుకలను గురువారం ఆలయ ఈఓ విజయరామారావు పోలీసులు, ఆలయ సిబ్బంది సమక్షంలో వంద రూపాయల అక్షరాభ్యాస మండపంలో లెక్కింపు నిర్వహించారు. ఈ హుండీ లెక్కింపులో నగదు రూ.53లక్షల24వేల420, మిశ్రమ బంగారం 102 గ్రాములు, మిశ్రమ వెండి 4కిలోల 60 గ్రాములు, విదేశీ కరెన్సీ 18 డాలర్లు వచ్చాయని ఈఓ తెలిపారు. ఈ ఆదాయం ఆలయానికి 51 రోజుల్లో సమకూరిందన్నారు. హుండీ లెక్కింపులో ఆలయ చైర్మన్ శరత్ పాటక్, ఆలయ అధికారులు స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, ఆలయ వాగ్దేవి సొసైటీ సభ్యులు, హోంగార్డ్స్ పాల్గొన్నారు.

అధికార అండ..ఇసుక దందా..!

- గోదావరి నుండి ఇసుక అక్రమ రవాణా
- వందల ట్రాక్టర్లు..వేల ట్రిప్పులు
- అధికార పార్టీ పెద్దల కనుసన్నల్లో అక్రమ దందా?
- చూసీచూడనట్లుగా మైనింగ్, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ అధికారులు

ఇసుక దందాతో అక్రమార్కులు కోట్లు కూడబెడుతున్నారు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో అక్రమ దందా సాగుతున్నా కట్టడి చేయాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీ పెద్దల కనుసన్నల్లోనే గోదావరి నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు విమర్శలున్నాయి. నిత్యం వందల ట్రాక్టర్లతో వేలాది ట్రిప్పులు వేస్తున్నారు. కోట్ల రూపాయల ప్రభుత్వ సొమ్ముకు గండి కొడుతున్నారు. ట్రాక్టర్‌కు ఇంత అని వసూలు చేస్తూ ముట్టాల్సిన వారికి ముట్టజెపుతున్నారనే ఆరోపణలు పెద్ద ఎత్తున విన్పిస్తున్నాయి.

నవతెలంగాణ - హాజీపూర్

జిల్లా కేంద్రానికి కేవలం మూడు కిలోమీటర్ల దూరంలోని వేంపల్లి గ్రామ శివారు గోదావరి నుండి రాత్రీపగలు తేడా లేకుండా ట్రాక్టర్లతో అక్రమంగా ఇసుక తరలిస్తూ కోట్లు దండుకుంటున్నారు. వేంపల్లి, ర్యాలీ వాగు ఒడ్డున ఎటు చూసినా ఇసుక డంపులే దర్శనమిస్తున్నాయి. ట్రాక్టర్ యజమానులు ఒక్కటై అధికార పార్టీ పెద్దల అండదండలతో ఈ వ్యవహారం సాగుతోందని ప్రజలు బాహాటంగానే చర్చించుకుంటున్నారు. అడిగిన, అడ్డువచ్చిన వారికింత ఇచ్చుకుంటూ సంబంధిత అధికారులను అటు వైపు రాకుండా చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. వారం, పది రోజులుగా ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండడంపై ప్రజలు మండి పడుతున్నారు.

ఎటు చూసినా ఇసుక డంపులే..

వేంపల్లి శివారు గోదావరి పరిసర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో ఇసుక డంపులు వెలిశాయి. గోదావరి నుండి ఇసుక డంపులకు చేరవేస్తూ అక్కడి నుండి అర్డర్ల ప్రకారం జేసీబీ ద్వారా లోడ్ చేస్తూ ట్రాక్టర్ ఇసుక ట్రిప్పుకు రూ.3వేల నుండి రూ.4వేల వరకు వసూలు చేస్తున్నారు. 'ట్రాక్టర్‌కు ఇంత వసూలు చేస్తున్నారు..ఇయ్యని ట్రాక్టర్లను పోనియ్యడం లేదు'. అంటూ అక్కడికెళ్లిన నవతెలంగాణ విలేకరికి చెప్పడం గమనార్హం. గోదావరి నుండి దారులు చేస్తే, డంపులు పోస్తే ఆ భూముల యజమానులకు ఒక్కొక్కరికి రూ.50వేల వరకు ఇవ్వాల్సి ఉంటుందని, ఇంకా ఖర్చులున్నాయని చెప్పుకొచ్చారు. వీరి మాటలు వింటే ఇసుక దందా ఎంత పెద్ద మొత్తంలో జరుగుతుందో అర్థమవుతోంది.

ధ్వంసమవుతున్న రోడ్లు

వేంపల్లి మేకల మండి పక్క నుండి గోదావరికి ఇసుక ట్రాక్టర్లు నడుస్తుండడంతో రోడ్లు ధ్వంసమవుతున్నాయి. రోజూ రాత్రుళ్ల వందల ట్రాక్టర్లు ఆ గల్లీ రోడ్డుపై ఓవర్ లోడ్‌తో వెళుతుండడంతో పాడవుతున్నాయంటు గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఎవరికి చెప్పినా ట్రాక్టర్లు ఆగడం లేదని, యథేచ్ఛగా నడుస్తున్నాయని అంటున్నారు. రామాలయం ముందున్న కల్వర్టు కూలిపోయే దశకు చేరిందని వాపోతున్నారు. పద్మావతి గార్డెన్ రోడ్డుకు అడ్డంగా ముళ్ల కంచెలు ఏర్పాటు చేసినా వాటి పైనుండి ట్రాక్టర్లు వెళ్తున్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి

గతంలో గుడిపేట్, ముల్కల్ల గ్రామాల శివారు గోదావరి నదిలో ప్రభుత్వం ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసింది. వాటి ద్వారా కోట్ల రూపాయల ఆదాయం చేకూరింది. సంబంధిత గ్రామాలకు భారీగా నిధులు వచ్చాయి. ఇప్పుడు రీచ్‌లు ఏర్పాటు చేయకపోవడంతో అక్రమార్కులు రాయల్టీ చెల్లించకుండానే ఇసుక తోడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. గతేడాది గుడిపేట్ రీచ్‌కు సంబందించి 5నెలల కాలంలోనే రూ.94 లక్షలు, ముల్కల్ల రీచ్‌కు రూ.72.48లక్షల ఆదాయం వచ్చిందని మైనింగ్ అధికారులు చెబుతున్నారు. ఇలా అక్రమంగా ట్రాక్టర్లతో ఇసుక తరలించడం సాధ్యమైనప్పుడు రీచ్‌ల ఏర్పాటు ఎందుకు సాధ్యం కాదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వందల సంఖ్యలో ట్రాక్టరు నడుస్తుంటే ఒకటి, రెండు ట్రాక్టర్లను మాత్రమే మొక్కుబడిగా సీజ్ చేయడంలో మతలబేంటని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు : కుమురం బాలు, ఏడీ, మైనింగ్

వేంపల్లి గ్రామం వెనుకాల ఉన్న వాగు నుండి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను రెండు రోజుల క్రితం సీజ్ చేశాం. గోదావరిలో నీరు తగ్గిన తరువాత ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేస్తాం. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవు.





జిల్లా వ్యవసాయాధికారిని సస్పెండ్ చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా వ్యవసాయాధికారిని సస్పెండ్ చేయాలిని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట దిష్టిబొమ్మ దహనానికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాకురి తిరుపతి, దుర్గం నూతన్‌కుమార్ మాట్లాడారు. డీఏఓ ఎరువుల దుకాణాల యాజమాన్యంతో కుమ్మక్కయ్యారన్నారు. రైతులకు ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తుంటే చోద్యం చూస్తున్న వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నా యజమానులపై చర్య తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఎరువుల దుకాణాల వద్ద ధరల పట్టిక ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు సత్యనారాయణ, తిమ్మాపూర్ ముత్తన్న జిల్లా కమిటీ సభ్యులు సుంచుల నారాయణ, జాన్‌పాల్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

నవతెలంగాణ-భైంసా



మండలంలోని దేగాం గ్రామానికి చెందిన సట్ల సురేఖ(27) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. సురేఖను ఆమె భర్త తాడుతో ఉరేసి చంపాడని మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు ఆరోపిస్తున్నారు. హత్యకు పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆందోళన చేపట్టారు. 9 సంవత్సరాల క్రితం దేగాం గ్రామానికి చెందిన రాముకు మహారాష్ట్రలోని బాలాపూర్ గ్రామానికి చెందిన సురేఖతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. రూరల్ సిఐ చంద్రశేఖర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పండ్ల మొక్కల పెంపకానికి ప్రాధాన్యతనివ్వండి



నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో పండ్ల మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలని మంచిర్యాల డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ వినాయక్ కుమార్ సాహూ సూచించారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రమేశ్‌తో కలిసి గురువారం మండల పరిధి నర్సింగాపూర్, షెట్‌పల్లి గ్రామ పంచాయతీ నర్సరీలను పరిశీలించారు. గ్రామ పంచాయతీల పరిధిలో పంపిణీ చేయడం కోసం ప్రధానంగా పండ్ల మొక్కలు పెంచడం అవసరమని పేర్కొన్నారు. అదేవిధంగా నర్సరీల నిర్వాహణలో సమయానుగుణంగా డిబ్లింగ్, గ్రేడింగ్, షిఫ్టింగ్ చేపట్టాలని సూచించారు. బ్యాగుల్లోని మొక్క ఎదుగుతున్న సమయంలో వేర్లు భూమిలోకి పోవడం జరుగుతుందని, షిఫ్టింగ్ చేయడం ద్వారా వేర్లు భూమిలోకి పోకుండా జాగ్రత్తపడాలని అన్నారు. బెడ్ల మధ్యలో పిచ్చి మొక్కలు పెరగకుండా ఎప్పటిప్పుడు వీడింగ్ చేయాలని, మొక్కల్లో పిచ్చి మొక్కలు కన్పిస్తే వెంటనే వాటిని తీసివేయాలని సూచించారు. ప్రధానంగా క్రమం తప్పకుండా నీరు అందిచాలని సూచించారు. నర్సరీల్లో పెంచుతున్న మొక్కల వివరాలు అడిగి తెల్సుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేడి రవి, పెగడపల్లి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రాంసింగ్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు సంతోష్, సాగరిక, పంచాయతీ కార్యదర్శి ప్రతిభ ఉన్నారు.

చిరుధాన్యాలు ఆరోగ్యానికి మేలు



ఆసిఫాబాద్ : చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని మార్కెట్ కమిటీ చైర్మన్ రైతుబంధు మండల సమన్వయకర్త గాదవేణి మల్లేష్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ చిరుధాన్యాల రోడ్ షోకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దస్నాపూర్ నుండి కోర్టు చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. రైతులు చిరుధాన్యాల పంటల వైపు ప్రయత్నాలు చేయాలన్నారు. ప్రకృతి సిద్ధమైన పంటల వల్ల వాతావరణ సమతుల్యత సాధ్యమవుతుందన్నారు. మండల వ్యవసాయ అధికారి ఖాదర్ హుస్సేన్ మాట్లాడుతూ చిరుదాన్యాలు పండించడం వల్ల రైతుకు పెట్టుబడి ఖర్చులు తగ్గి ఆదాయం పెరగడంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, నేడు మనం ఎదుర్కొంటున్న మధుమేహం, ఉబకాయం, కాన్సర్, గుండె జబ్బులు వంటి రోగాలకు విరుగుడు చిరు ధాన్యలేనని అన్నారు. అదేవిధంగా పశు పక్షుల్ని, పర్యావణాన్ని రక్షించవచ్చని అన్నారు. భారత ప్రభుత్వ ప్రతిపాదనను అనుసరించి ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు 2023 సంవత్సరమును ప్రపంచ వ్యాప్తంగా చిరుధాన్యల సంవత్సరముగా జరుపబడుతుందని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు శిడాం రాము, స్రవంతి, గంట రాము దస్నాపూర్ గ్రామ పెద్దలు వైరాగడే శంకర్ పటేల్, హరేందరే నాందేవ్, దశరథ్ ఆకాష్, కమన్కర్ పెంటు, లక్ష్మన్, విఠల్ పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



లక్షెట్టిపేట్‌లో..



జైపూర్‌లో..

నవతెలంగాణ-లక్షెట్టిపేట్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 2వ విడత కంటి వెలుగును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాలలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాలతో పాటు ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. కంటి వెలుగును ఇతర రాష్ట్ర ముఖ్యమంత్రులు అభినందించడం మరువలేనిదన్నారు. తెలంగాణ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. అనంతరం కంటి పరీక్షలకు వచ్చిన రోగులతో ఎమ్మెల్యే మాట్లాడారు. అంతకుముందు అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగన్న, మున్సిపల్ చైర్మన్ కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పాదం శ్రీనివాస్, మండలాధ్యక్షుడు చుంచు చిన్నయ్య, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ కేతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ సురేష్ నాయక్, కో-ఆప్షన్ మోత్కూరి వెంకటస్వామిగౌడ్, దొంత నర్సయ్య పాల్గొన్నారు.

జైపూర్ : కంటి వెలుగు నూరు శాతం పూర్తికి కృషి చేయాలని మండల పరిషత్ అధ్యక్షురాలు గోదరి రమాదేవి లక్ష్మణ్ కోరారు. గురువారం జెడ్పీటీసీ మేడి సునిత తిరుపతితో పాటు అధికారులతో కలిసి కంటి వెలుగును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల కేంద్రంలో గల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు బెజ్జాల గ్రామంలో కంటి వెలుగు పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కంటి సమస్య ఉన్న ప్రతి ఒక్కరు విధిగా కంటి పరిక్ష చేయించుకోవాలని సూచించారు. యాసంగి వ్యవసాయ పనులు ప్రారంభమైనందున గ్రామీణుల అందుబాటు దృష్టితో కంటి వెలుగు పరీక్షలు కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆసంపల్లి సువర్ణ రాజమల్లు, ఎంపీటీసీ లింగస్వామి, తహసీల్దార్ మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ సత్యనారాయణ, ఎస్సై రామకృష్ణ, వైద్యాధికారి అనిల్ కుమార్, టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు బలమూరి అరవిందరావు, పాలమాకుల సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రంగన్న పాల్గొన్నారు.

ఉట్నూర్ : ప్రజల ఆరోగ్య సమస్యలను దృష్టిలో పెట్టుకొని రెండో విడతలో నిర్వహించే కంటి వెలుగును ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పంద్రా జైవంత్‌రావ్, జెడ్పీటీసీ రాథోడ్ చారులత అన్నారు. స్థానిక గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని అడిషనల్ డీఎంహెచ్ఓ కుంరం బాలుతో కలిసి వారు ప్రారంభించారు. వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పంద్రా జైవంత్‌రావ్ మాట్లాడుతూ సర్వేంద్రియనం నయనం ప్రధానం అంటే శరీరంలో అన్ని అవయవాల్లో కళ్లఅత్యంత ప్రధానమైనవన్నారు. అడిషనల్ డీఎంహెచ్ఓ కుంరం బాలు మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలో 31 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కంటి వెలుగు కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ తిరుమల, దంతన్‌పల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు అనురాధ, రాంబాబు, సంతోష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రెబ్బెన : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్, సర్పంచ్ అహల్యాదేవి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమాన్ని మండలంలోని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, ఎంపీటీసీ పెసరి మధునయ్య, ఎంపీడీఓ సత్యనారాయణసింగ్, ఎంపీఓ అమ్జత్‌పాషా, డాక్టర్ రాకేష్, సీహెచ్ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కౌటాల : ఉచిత కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆరు నెలల పాటు ఉచిత కంటి వెలుగు శిబిరాన్ని కొనసాగించడానికి ఆదేశాలివ్వడంతో గురువారం మండల కేంద్ర గ్రామ పంచాయతీలో కంటి వెలుగు శిబిరాన్ని సీఐ బుద్దె స్వామి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, ఎస్ఐ ప్రవీణ్, సర్పంచ్ మౌనీష్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉచితంగానే పరీక్షలు నిర్వహించి అద్దాలు ఇస్తారని, ఆపరేషన్ అవసరమున్న వారికి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి సాయికృష్ణ, ఉప సర్పంచ్ పసునూరి తిరుపతి, బీఆర్ఎస్ యువజన సంఘం మండలాధ్యక్షుడు తాళ్లపెల్లి రవీందర్‌గౌడ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సముద్రాల సరిత, సర్పంచ్ మేకల కమల అన్నారు. గురువారం మండలంలోని పెంచికల్‌పేట్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని, ఏవైనా సమస్యలున్న వారికి కళ్లజోళ్లను, మందులను ఉచితంగా అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నేహా, ఫస్లిన్, ఎంపీడీఓ గంగాసింగ్, ఎస్ఐ విజయ్‌కుమార్, కంటి వెలుగు మెడికల్ అధికారి సురేందర్, అగర్‌గూడ సర్పంచ్ పాలె సుధాకర్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వాంకిడి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలల పాటు ఉచిత కంటి వెలుగు శిబిరాన్ని కొనసాగించడానికి ఆదేశాలివ్వడంతో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్ర గ్రామ పంచాయతీ కార్యాలయంలో కంటి వెలుగు శిబిరాన్ని మండలాధ్యక్షురాలు ముండె విమలాబాయి, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటి చూపు లేనివారికి, దగ్గరి చూపు కనబడని వారికి కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బండె తుకారాం, ఉప సర్పంచ్ పవన్‌సాయి, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, వైద్యసిబ్బంది, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

జైనూర్ : అంధత్వ నివారణకు రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు పరీక్షలు నిర్వహిస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనయ యాదవరావు, సిర్పూర్(యు) జెడ్పీటీసీ కోవ అరుణ, ఎంపీపీ కుమ్రం తిరుమల అన్నారు. గురువారం జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటి వెలుగుతో పేద ప్రజలకు ఎంతో లాభం కల్గుతుందన్నారు. కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొన్న ఉత్తరప్రదేశ్, కేరళ, పంజాబ్, ఢిల్లీ ముఖ్యమంత్రులు వారి రాష్ట్రాల్లో ప్రారంభించడానికి ప్రయత్నం చేస్తామని చెప్పారన్నారు. కార్యక్రమంలో సిర్పూర్(యు) ఎంపీపీ తొడసం భాగ్యలక్ష్మి, లింగాపూర్ ఎంపీపీ అడె సవిత ప్రేమ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, వైస్ ఎంపీపీ చిర్లె లక్ష్మణ్ యాదవ్, ఆత్రం ప్రకాష్, ఆత్మారాం నాయక్, ఎంపీడీఓ ప్రభుదయ, మధుసూదన్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఇంతియాజ్‌లాల, తొడసం భీంరావు, వైద్యాధికారులు నాగేంద్ర, జితేందర్, ఎస్ఐ మధుకర్, సర్పంచ్‌లు మెస్రం పార్వతి లక్ష్మణ్, కనక ప్రతిభ వెంకటేశ్ పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో మాట్లాడుతూ కంటి పరీక్షల నిమిత్తం వచ్చే ప్రజలు ఎలాంటి అసౌకర్యాలు కల్గకుండా పరీక్షలు చేయాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ నవత, ఎంపీడీఓ రాజేశ్వర్, స్పెషల్ ఆఫీసర్ వెంకటేశం, సూపర్‌వైజర్ రాజలింగు, ఇతర వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో..



కౌటాలలో..



జైనూర్‌లో..